క్లుప్తంగా

డాక్టర్ అయినంపూడికి సత్కారం



తెనాలి: ఎన్టీఆర్ శత జయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఇక్కడి పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన సభలో 'రాజకీయాల్లో అన్నగా ఎన్టీఆర్' అనే అంశంపై డాక్టర్ పుల్లేటికుర్తి ఎస్.వి.శ్రీనుబాబు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. ప్రముఖ మానసిక వైద్యుడు, మధుర గాయకుడు డాక్టర్ అయినంపూడి శరత్‌బాబును సత్కరించారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, మాదల కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్సాద్, కంచర్ల ఏడుకొండలు, కంచర్ల నాగభూషణం, దంతాళ ప్రేమ్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంకీర్తన గురువు వసుంధరకు సత్కారం



తెనాలి: అన్నమాచార్య కీర్తనల ప్రచారంలో కొనసాగుతున్న తెనాలికి చెందిన సంకీర్తన గురువు కొండపి వసుంధరను ఆదివారం స్థానిక వైకుంఠపురం దేవస్థానంలో సత్కరించారు. పట్టణానికి చెందిన శ్రీసత్యనారాయణ భజన మండలి ఆధ్వర్యంలో ఈ సత్కారం చేశారు. అన్నమయ్య కీర్తనలను ఉచితంగా నేర్పటమే కాకుండా తమను తిరుమల నాద నీరాజనం మండపం, ఒంటిమిట్ట, తాళ్లపాకలో సంకీర్తన చేయించటం, వైకుంఠపురంలోని బ్రహ్మోత్సవాల్లోనూ అవకాశం ఇచ్చినందుకు శిష్యబృందం తమ గురువును సత్కరించుకుంది. అనితమాధవి, మారా లలితకుమారి, గుబ్బా లక్ష్మీకుమారి, కంభంపాటి లీలారత్నకుమారి, చౌట నాగమల్లేశ్వరి, దేవిలలిత, తాడేపల్లి సూర్యనాగమల్లేశ్వరి పర్యవేక్షించారు. నృత్యగురువు జి.నిర్మల రమేష్, సురాబత్తుల కేశవరావు, కొండపి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యేసయ్య ప్రార్థనాకొండ చర్చిలో మదర్స్‌డే వేడుకలు



తెనాలిటౌన్: ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనాకొండ చర్చిలో ఆదివారం మదర్స్‌డే వేడుకలు జరిపారు. సంఘకాపరి బ్రదర్ ఆనందన్న, దైవసేవకురాలు పి.రత్నకుమారి మాతృమూర్తులను సత్కరించారు. కుటుంబంలో అమ్మపాత్ర అనే అంశంపై ప్రసంగించారు.

రసవత్తరంగా క్రికెట్ టోర్నీ



తాడేపల్లిరూరల్: పెనుమాక గ్రామంలోని జూనియర్ ప్రభుత్వ కళాశాలలో కళ్లం ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా సాగుతోంది. విలేకరులతో ఆదివారం టోర్నమెంట్ నిర్వాహకుడు కళ్లం గోవిందరెడ్డి మాట్లాడారు. మొత్తం 64 టీమ్‌లు టోర్నమెంట్‌లో పాల్గొనగా.. ఆదివారం 8 టీమ్‌లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయని వెల్లడించారు. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఐశ్వర్య 786 జట్టు, యూసీ11 జట్టుపై విజయం సాధించిందని తెలిపారు. మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన ఐశ్వర్య 786 క్రికెటర్ అనంత చింటుకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కళ్లం గోవిందరెడ్డి, అంపైర్ గరుగు సుబ్బారెడ్డి అందజేశారని తెలిపారు.

సమ్మర్ క్యాంప్ ప్రారంభం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంప్ ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహక సభ్యులు భీమవరపు దశరథరామిరెడ్డి మాట్లాడారు. సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకునేందుకు పోటీ పడాలని కోరారు. మొదటి రోజు కోటేశ్వరరావు మాస్టర్ సైన్స్, పద్మావతి టీచర్ నీతి కథలు, దేశ నాయకుల జీవిత విశేషాలను వివరించారని తెలిపారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు ఆర్‌వీ రాఘవయ్య, క్లబ్ నిర్వాహకులు సోలా ముత్యాలరావు, యనమాల బర్నబాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో నేత్ర శిబిరం

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని రామనాథం చిన కోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో ఆదివారం 96వ నేత్ర పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఆశ్రమం అధ్యక్షుడు రామనాథం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. మొత్తం 50 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లు అందజేశారు.

జై భజరంగ భళీ

- వైభవంగా హనుమజ్జయంత్యుత్సవం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- అంజనీపుత్రునికి అభిషేకాలు
- తెనాలిలో హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి/తెనాలిటౌన్: హనుమజ్జయంతి రోజున తెనాలిలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. పలు ఆలయాల్లో హనుజ్జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. హనుమాన్ శోభాయాత్రను భారీగా నిర్వహించారు. హనుమంతుడి బొమ్మతో కూడిన కాషాయ జెండాలు, జాతీయ పతాకాలను చేతబట్టి వందలాదిమంది శోభాయాత్రలో పాల్గొన్నారు. జైశ్రీరామ్, జైహనుమాన్ నినాదాలతో యాత్రలో కొనసాగారు. హనుమాన్ శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రను, ఆదివారం సాయంత్రం స్థానిక సుల్తానాబాద్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత స్వామి విగ్రహంతో కూడిన ప్రత్యేక రథానికి పూజలు చేశారు. అనంతరం స్వయంగా యాత్రలో పాల్గొన్నారు. రాజకీయాలకతీతంగా భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్న శోభాయాత్ర చెంచుపేట, ఓవర్‌బ్రిడ్జి, మార్కెట్ వంతెన, రైల్వేస్టేషన్ వంతెన, ప్రకాశం రోడ్డు, రజకచెరువు, నెహ్రూ రోడ్డు, గాంధీచౌక్, శివాజీచౌక్, కొత్తపేట, దేవీచౌక్ మీదుగా బోసు రోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి గుడివరకు కొనసాగింది. వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నేతలు యాత్రలో పాల్గొన్నారు. శోభాయాత్ర కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. హనుమజ్జయంతి సందర్భంగా చిట్టి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రముఖ సంగీత విద్వాంసుడు, 'కలైమామణి' డాక్టర్ తాడేపల్లి లోకనాథశర్మ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

■ షరాఫ్‌బజార్‌లోని సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. స్వామికి పంచామృత స్నపన, విశేష నాగదశార్చన, చాలీసా పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్, సురేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. హనుమజ్జయంతి సందర్భంగా స్వామికి రామకృష్ణ, పద్మావతి దంపతులు వెండి గదను, గొల్లపూడి అనూరాధ కుటుంబ సభ్యులు దక్షిణావృత శంఖును అందజేశారు. తెలుగు పండితులు ములుకుట్ల విశ్వనాథశర్మ, హనుమంతుని విశిష్టతను గురించి భక్తులకు వివరించారు. వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్.బి.శివ, కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనూరాధ, మున్సిపల్ కౌన్సిలర్‌లు పి.త్రిమూర్తి, దేసు యుగంధర్, సంకీర్తనాబృందం సభ్యులు, సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పంచముఖ ఆంజనేయస్వామి అర్చకులకు దక్షిణావృత శంఖంను అందజేస్తున్న అనూరాధ కుటుంబ సభ్యులు



చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో స్వామి

■ మారీసుపేటలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం పుష్పాదివాసం, పూజలు జరిపారు. లలితా గోష్ఠి వారిచే హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సాయంత్రం సువర్చలా హనుమత్ కల్యాణం జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సేతు మాధవరావు, సభ్యులు పర్యవేక్షించారు

■ నాజరుపేటలోని లక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా వీరాంజనేయస్వామికి పంచామృత, పంచసూక్తములతో అభిషేకం, సహస్రనామార్చన పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను ప్రారంభించారు.

■ నెహ్రూరోడ్డులోని గోవర్ధనస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. స్వామికి పంచామృతాలతో స్నపన, లక్ష తమలపాకులతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లీశ్వరి, అర్చకులు రఘు, మాధవ భట్టాచార్య, సుబ్బారావు, భక్తులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో ఎమ్మెల్యే శివకుమార్, కమిటీ నేతలు



పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామిని భక్తులకు చూపిస్తున్న అర్చకులు



లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గోవర్ధనస్వామి ఆలయంలో తమలపాకులతో స్వామివారికి పూజలు

జగనన్న కాలనీని సందర్శించిన కత్తెర సురేష్



ఐనవోలు(తాడికొండ): తుళ్ళూరు మండలం ఐనవోలు గ్రామంలోని వైఎస్సార్ జగనన్న కాలనీని ఆదివారం తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పరిశీలించారు. కాలనీలో రోడ్లు, స్థలాల పనుల పురోగతిని తెలుసుకున్నారు. సీఆర్డీఏ చట్టంలో పొందుపరిచిన విధంగా పేదలకు రాజధానిలో వసతి కల్పించేందుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. పేదలను అణగదొక్కి కేవలం ఓ వర్గానికే ప్రాతినిధ్యం ఉండాలనే లక్ష్యంతో చంద్రబాబు నాయుడి అరాచకాలకు చెక్ పెడి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర వ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు

తాడేపల్లిరూరల్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా చైతన్య, నారాయణ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఆరోపించారు. ప్రైవేట్ కళాశాలల ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటలు చేస్తామని స్పష్టం చేశారు. మంగళగిరి నియోకవర్గ ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి గౌరవ అతిథిగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శ్రీ చైతన్య, నారాయణ విద్యా సంస్థల్లో విద్యా సంవత్సరం మొదలుకాక ముందే ఇంటర్ బోర్డు అధికారులు తనిఖీలు నిర్వహించాలని కోరారు.

కమిటీతో పని లేకుండా పీఆర్సీ అమలు చేయాలి

తెనాలి: పీఆర్సీ కమిటీతో సంబంధం లేకుండా జూన్ ఒకటో తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలుచేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాష కోరారు. సంఘం తెనాలి యూనిట్ కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. అధ్యక్షత వహించిన చాంద్‌బాష ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 22 నుంచి ఆందోళనకు సిద్ధమవుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి తక్షణమే సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్ల పెన్షన్లు అన్నీ ప్రతినెలా ఒకటో తేదీన అందేలా చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, 1993 నవంబరు 25కు ముందు నుంచి పనిచేస్తున్న ఎన్ఎంఆర్‌లను రెగ్యులర్ చేయాలని, సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ ప్రవేశపెట్టాలని కోరారు. గుంటూరు నగర శాఖ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు మోర్ల పోతురాజు, కోట సాహేలు, తెనాలి యూనిట్ నూతన అధ్యక్షుడు నల్లనూకల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కొడాలి సౌజన్య, అసోసియేట్ అధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు దగ్గుపాటి సుధీర్‌బాబు, సైదులు, సంయుక్త కార్యదర్శి గైరుబోయిన విజయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాంద్‌బాష

వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవాలు

మేడికొండూరు: డోకిపర్రు గ్రామంలోని పోలేరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. అన్నదానం సందర్భంగా భోజనం వడ్డించారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు కనుల పండువగా సాగింది. జడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, బీవీ సుబ్బారెడ్డి, రాజేంద్రప్రసాద్, పాములపాటి జయరావు, ఎంపీటీసీ కొలకలూరి నాగేశ్వరావు, ఉడతా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కత్తెర సురేష్ కుమార్

నేటి నుంచి అభ్యంతరాల స్వీకరణ

నకరికల్లు : ఈనెల 15వతేదీ నుంచి 18వతేదీ వరకు డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా పథకం కొత్త రిజిస్ట్రేషన్‌లపై అభ్యంతరాల స్వీకరణ చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు ఆదివారం తెలిపారు. రైతు భరోసాకేంద్రాల వారీగా అర్హుల, అనర్హుల జాబితాను ప్రదర్శించామన్నారు. గతేడాది లబ్ధి పొంది ప్రస్తుతం మరణించి ఉంటే వారి భర్త గాని, భార్యగాని నామినీగా నమోదు చేసుకోవచ్చన్నారు. దీనికోసం భూమిపత్రాలు, ఆధార్‌కార్డు, ఇతరపత్రాలను ఆయాగ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాలన్నారు. అర్హుల, అనర్హుల జాబితాపై సందేహాలుంటే వీఏఏలకు తెలియజేస్తే డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసాపోర్టల్‌లో పొందురుస్తారని తెలిపారు.

తెనాలిలో గంజాయి పట్టివేత

తెనాలి రూరల్:తెనాలి మండలం హాఫ్‌పేట సమీపంలో రూరల్ పోలీసులు ఆదివారం రాత్రి గంజాయిని పట్టుకున్నారు. నలుగురు యువకులు గంజాయి తెచ్చి విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా నందివెలుగు-గుంటూరు మార్గంలో 2.1 కిలోల గంజాయిని గుర్తించారు. నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

పూర్వవిద్యార్థుల సంఘం 'బాల్యమిత్ర' 8వ వార్షికోత్సవం

తెనాలి: స్థానిక తాలూకా బ్రాంచ్ హైస్కూలు పూర్వవిద్యార్థుల సంఘం 'బాల్యమిత' ఎనిమిదో వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక బోసురోడ్డులోని అతిథి రెస్టారెంట్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ వేడుకను జరుపుకున్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. తాలూకా బ్రాంచ్ హైస్కూలు పూర్వవిద్యార్థులు 2016లో తొలిసారిగా కలుసుకున్నారు. నాటి సభలో తమ గురుదేవుళ్లను సత్కరించుకున్నారు. అప్పటి నుంచి ప్రతినెలా సమావేశాలు జరుపుతూ ఆర్థికంగా ఒకరికొకరు సహకారం అందించుకుంటున్నారు. మరోవైపు అందరి ఆర్థిక సహకారంతో వివిధ సేవాకార్యక్రమాలను చేపడుతున్నట్టు బాల్యమిత్ర అధ్యక్షుడు గద్దె శంకరరావు వెల్లడించారు. రాబోయే కాలంలో మరిన్ని సమాజ కార్యక్రమాలను చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు టి.శరత్, ప్రధాన కార్యదర్శి ఏవీ పాండురంగారావు, ఆర్థిక కార్యదర్శి డి.లోకేశ్వరరావు, అన్నవరపు సురేష్, అంగిరేకుల ప్రసాద్, మల్లెల సత్యనారాయణ మూర్తి, కలాం, ఎంఎస్సార్, తుంపూడి సత్యనారాయణ, అరుణప్రసాద్, అద్దేపల్లి కేశవరావు, మురళి, ఉదయభాస్కర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ విద్యార్థులతో బాల్యమిత్ర సంఘీయులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆక్యుప్రెజర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని క్లబ్ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి అన్నారు. ఆదివారం వంశీ టాలెంట్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని ఆయన సందర్శించారు. 4వ రోజుకు సుమారు 150 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారని తెలిపారు. మరో రెండు రోజులు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఎంటీఎంసీ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆక్యుప్రెజర్, మాగ్నటిక్, వైబ్రేషన్ థెరపీ అందిస్తున్నట్లు వివరించారు. క్లబ్ కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, జొన్నా రాజేష్, ట్రెజరర్ రామకృష్ణ శెట్టి, ప్రసాద్‌రెడ్డి, బుర్రముక్కు శ్రీరామ్, డాక్టర్ సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

విద్యార్థినికి ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని డోలాస్ నగర్‌కు చెందిన తాడేపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హిమబిందు అనే విద్యార్థినికి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఓ ప్రైవేటు స్కూల్లో జరిగిన కార్యక్రమంలో క్లబ్ తాడేపల్లి అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ.. డోలాస్‌నగర్‌కు చెందిన విద్యార్థిని ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 400 మార్కులు సాధించిందని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న హిమబిందుకి బుక్స్ కోసం రూ.9,500 అందజేసినట్లు చెప్పారు.



విద్యార్థినికి నగదు ఇస్తున్న వివేకానందరెడ్డి

ఆర్బీకేల పరిధిలో భూసార పరీక్షలు

- సత్తెనపల్లి డివిజన్‌లో 133 రైతు భరోసా కేంద్రాలు
- ఆరు మండలాల్లో 211 మట్టి నమూనాలు

సత్తెనపల్లి: భూమి సార వంతంగా ఉంటేనే దిగుబడులు మెరుగవుతాయి. గత కొన్నేళ్లుగా రైతులు రసాయనాలు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో భూసారం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా సాగులో ఎరువుల వినియోగానికి అత్యధిక ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల పరిధిలో మట్టి నమూనాలు సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి రైతుభరోసా కేంద్రం పరిధిలో మట్టి నమూనాలు సేకరించాలని సిబ్బందికి సూచనలు చేసింది. ఇప్పటికే మండలాల వారీగా వీఏఏ, వీహెచ్ఎ, వీఎస్ఏలకు మండల స్థాయిలో ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించి మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలతో అనేక ప్రయోజనాలు చేకూరుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నేలలో ఉదజని సూచిక, ఆమ్ల, క్షార లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, భాస్వరం, పొటాషియం నిష్పత్తులు వెల్లడవుతాయని చెబుతున్నారు. తద్వారా పొలానికి ఏయే ఎరువులు ఎంత మోతాదులో వినియోగించాలో తెలుసు కోవచ్చు. తద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. సూక్ష్మ ధాతుల లోపాలను సవరించుకుని సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చు. నమూనాలకు సేకరించే మట్టిలో రాళ్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చేసుకోవాలి. రైతు వివరాలు, పంట తదితర వివరాలను పొందుపరచాలి. అప్పుడే ఆ మట్టిని ల్యాబ్‌కు పరీక్ష నిమిత్తం పంపిస్తారు.



కందులవారిపాలెంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సత్తెనపల్లి డివిజన్‌లో ఆర్బీకేలు, మట్టి నమూనాలు ఇలా...

మండలం	ఆర్బీకేల సంఖ్య	మట్టి నమూనాలు
సత్తెనపల్లి	20	60
ముప్పాళ్ళ	13	26
రాజుపాలెం	14	29
నకరికల్లు	14	-
పెదకూరపాడు	14	-
అచ్చంపేట	17	50
అమరావతి	16	-
క్రోసూరు	15	26
బెల్లంకొండ	10	20
మొత్తం	133	211

ఫలితాలతో సాగు ఖర్చు తగ్గించుకోవచ్చు



రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా సాగు ఖర్చును తగ్గించుకోవచ్చు. వీఏఏ, వీహెచ్ఎ, వీఎస్ఏకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించాం. ఆర్బీకే సిబ్బంది ఇప్పటికే వారికి కేటాయించిన నమూనాలు సేకరించారు.

–ఎస్.శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకుడు, సత్తెనపల్లి

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ద్విచక్రవాహనం ఆటోను ఢీకొన్న ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన మండలంలోని గోళ్లపాడు గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. మండలంలోని తురకపాలెం గ్రామానికి చెందిన గుంటూరు హరీష్‌బాబు ద్విచక్రవాహనంపై తురకపాలెం నుంచి నరసరావుపేట బయలుదేరాడు. మార్గమధ్యలో గోళ్ళపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హరీష్ కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ కోత

తెనాలిరూరల్: పట్టణంలోని గాంధీనగర్, నందులపేట ప్రాంతాల్లో ఉదయం నుంచి కరెంట్ లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఉదయం విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలిగింది. సాయంత్రం నాలుగు గంటలైనా కరెంట్ రాలేదు. డీ3 సెక్షన్ ఆఫీసుకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.